8 జంతు జాతుల దత్తత



చార్మినార్: తెలంగాణ జూ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్ కుమారుడు యువన్ హిరేమత్ తన 8వ పుట్టిన రోజు సందర్భంగా గురువారం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో ఒక నెల పాటు 8 జంతు జాతులను దత్తత తీసుకున్నారు. వన్యప్రాణుల సంక్షేమం కోసం ఆయన తన తల్లిదండ్రులతో కలిసి జూను సందర్శించి, దత్తత కోసం చెల్లించిన మొత్తానికి సంబంధించిన వోచర్‌ను జూ క్యూరేటర్ జె.వసంతకు అందజేశారు. అనేక మంది వ్యక్తులు, కార్పొరేట్ రంగం, బ్యాంకులు, విద్యాసంస్థలు జంతువుల నిర్వహణ కోసం దత్తత తీసుకోవడానికి, విరాళం ఇవ్వడానికి ముందుకు వస్తున్నారన్నారు. ఒక రోజు నుంచి ఒక సంవత్సరం వరకు ఈ దత్తత పథకం అందుబాటులో ఉన్నందున, పౌరులందరూ ముందుకు వచ్చి తమకు నచ్చిన జంతువులను దత్తత తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తప్పిపోయిన మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత



గౌలిపురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళ ఇంట్లో నుంచి తప్పిపోవడంతో పోలీసులు గుర్తించి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం... గౌలిపురాకు చెందిన అఖిలేష్ కుమార్, ఝాన్సీరాణి (40)లు దంపతులు. కాగా ఝాన్సీరాణి గత కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతూ ఈ నెల 4న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి అదృశ్యమైంది. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఏఎస్సై రంగనాయకులు ఆధ్వర్యంలో సిబ్బంది తప్పిపోయిన మహిళను గుర్తించారు. అనంతరం స్టేషన్‌లో వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నిరుపేద కాంట్రాక్టర్లను ఆదుకోండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో నిరుపేద కాంట్రాక్టర్లను ఆదుకోవాలని వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర మంత్రి, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.50 కోట్ల పాతబకాయిలు ఉన్నా వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. విజిలెన్స్ శాఖ సైతం రిపోర్టు అందించినా పాతబకాయిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారు. వాటర్‌బోర్డు ఎండీతో మాట్లాడి పాతబకాయిని ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నితిన్, ప్రశాంత్, శివకుమార్, పోల్కం వినయ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఫంక్షన్‌హాల్ సీజ్



క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేసిన ఇన్‌స్పెక్టర్ రాజు, ఇతర సిబ్బంది

అబిడ్స్: పోలీసు నిబంధనలను ఉల్లంఘించిన ఓ ఫంక్షన్‌హాల్‌ను గుడిమల్కాపూర్ పోలీసులు సీజ్ చేశారు. గుడిమల్కాపూర్ రింగ్‌రోడ్డు ప్రాంతంలోని క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌ను అనుమతులు లేకుండా డీజే మ్యూజిక్‌ను పెట్టడంతో గుడిమల్కాపూర్ పోలీసులు ఫంక్షన్‌హాల్‌ను సైతం సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఫంక్షన్‌హాళ్లల్లో, గార్డెన్‌లలో ఎవరైనా డీజే సిస్టమ్‌లను వినియోగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కొంత మంది ఫంక్షన్‌హాళ్ల వారు డీజేను ఉపయోగించి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ఫంక్షన్‌హాల్ నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు ఫంక్షన్‌హాళ్లను సీజ్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సప్త బంగారు బోనానికి ఏర్పాట్లు

- ఏడు అమ్మవారి ఆలయాలకు బంగారు పాత్రలోని నైవేద్యం సమర్పణ
- 2018 నుంచి బంగారు బోనమెత్తిన జోగిని నిషా క్రాంతికి ఈసారి మూడు ఆలయాలు మాత్రమే
- ఈనెల 26న గోల్కొండ జగదాంబ అమ్మవారికి మొదటి బోనం



బంగారు బోనం పాత్ర



బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి (ఫైల్)

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి ఉత్సవాలు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా జూలై 20న పాతబస్తీతో పాటు నగరంలో ఆషాఢ బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. అలాగే జూలై 21న పాతబస్తీలో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు, తదనంతరం మారు బోనంతో వేడుకలు ముగియనున్నాయి. ఈసారి ఘనంగా సప్తమాతృకల-సప్త బంగారు బోనం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

ఈసారి జోగిని నిషా క్రాంతి మూడు ఆలయాలకే మాత్రమే..

ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా సప్త మాతృకల-సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించడానికి భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ సిద్ధమైంది. 2018లో ప్రారంభమైన సప్తమాతృకల-సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాల్లో జోగిని నిషా క్రాంతి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పాల్గొంటోంది. బంగారు పాత్రలోని నైవేద్యాన్ని తలపై పెట్టుకుని దారి పొడవునా నృత్యాలు చేస్తూ భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ఏడు అమ్మవారి గుళ్లకు నిషా క్రాంతి బంగారు బోనాన్ని నిర్వాహకుల ద్వారా అమ్మవార్లకు సమర్పించింది. అయితే ఈసారి బంగారు బోనాన్ని కేవలం మూడు ఆలయాలకు మాత్రమే పరిమితమవుతోంది. ఈసారి గోల్కొండ జగదాంబ అమ్మవారితో పాటు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారు, బల్కంపేట ఎల్లమ్మ తల్లికి నిషా క్రాంతి బంగారు బోనాన్ని నిర్వాహకుల ద్వారా సమర్పించనుంది. ఇక విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి జోగిని శ్యామల బంగారు బోనాన్ని ఎత్తనుండగా.. మరో జోగిని అవికా పెద్దమ్మ తల్లి, చార్మినార్, లాల్ దర్వాజా అమ్మవార్లకు బంగారు బోనాలు ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ నిర్వాహకుల ద్వారా సమర్పించనున్నారు.

షెడ్యూల్ ఇలా..

- జూన్ 26న గోల్కొండ అమ్మవారికి సమర్పించే మొదటి బంగారు బోనంతో ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సప్తమాతృకల-సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా గోల్కొండ అమ్మవారికి మొదటి బోనం సమర్పించనున్నారు.
- భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తరఫున జగదాంబికా అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు పాత్రలో మొదటి బోనాన్ని సమర్పించనున్నారు.
- 29న విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి 2వ, బంగారు బోనం.
- జూలై 2న బల్కంపేట అమ్మవారికి మూడో బంగారు బోనం.
- జూలై 4 న జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి నాలుగో బోనం.
- జూలై 10న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి 5వ, బంగారు బోనం.
- 15న చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆరో బంగారు బోనం.
- జూలై 17న లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి చివరి 7వ బంగారు బోనం సమర్పించనున్నారు.

తగిన ఏర్పాట్లు చేశాం..



ఆషాఢ మాసం బోనాలను పురస్కరించుకొని ఈసారి సప్తమాతృకల సప్త బంగారు బోనం కార్యక్రమాన్ని మరింత వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశాం. బంగారు పాత్రలోని నైవేద్యాన్ని ఏడు అమ్మవారి ఆలయాలకు ఏడు బోనాలను సమర్పించనున్నాం.

– గోపిశెట్టి రాఘవేందర్, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్

దళితుడికి మంత్రి పదవి కేటాయించడం హర్షణీయం



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న మహేష్ బాబు

జియాగూడ: తెలంగాణలో మొదటి సారి మాదిగ సామాజిక వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి పదవిని ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి గౌరవించారని జియాగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ కార్యదర్శి, పబ్లిక్ సోషల్ వర్కర్ మహేష్‌బాబు అన్నారు. శుక్రవారం మంత్రి కార్యాలయానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మహేష్‌బాబు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ తర్వాత మాదిగ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి దక్కడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొమురవెల్లి మల్లికార్జున స్వామి పట్టు వస్త్రాల తయారీకి పూజలు



పూజల్లో ఈఓ అన్నపూర్ణ, మల్యాల మధుసూదన్‌యాదవ్

చార్మినార్: కొమురవెల్లి మల్లికార్జున స్వామితో పాటు అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించేందుకు ఆలయ ప్రాంగణంలో తయారు చేయించే ప్రక్రియకు గురువారం మంత్రోచ్ఛరణల నడుమ ప్రారంభించారు. పాతబస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు మల్యాల మధుసూదన్ యాదవ్ సునీత దంపతులు కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తానని చేసిన మొక్కులో భాగంగా అక్కడే తయారు చేయించే ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా స్వామి వారికి పట్టు దోవతి, పంచేతో పాటు సతీమణులైన కేతమ్మ, మేడలమ్మలకు పట్టు వస్త్రాలను తయారు చేయిస్తున్నారు. ఆలయ చరిత్రలో ఇది మొదటిసారి. ఆలయ ప్రాంగణంలో పట్టు వస్త్రాలను తయారు చేయించడం సంతోషంగా ఉందని మధుసూదన్ యాదవ్ సునీత దంపతులు అన్నారు. ఈ పూజా కార్యక్రమంలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈఓ అన్నపూర్ణ, అడిషనల్ ఈఓ శ్రీనివాస్, పట్టు వస్త్రాల తయారీ కళాకారుడు జయరాజు, ప్రధాన పూజారి మల్లికార్జున పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



ఆర్‌ఓబీ పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి

చార్మినార్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ తనిఖీలో శాస్త్రిపురం ఆర్‌ఓబీ, ఫలక్‌నుమా ఆర్‌ఓబీ, నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఓవైసీ ఫ్లైఓవర్, అజీమ్ హోటల్ రోడ్డు, గుర్రం చెరువు డ్రెయిన్ పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నప్పటికీ..మరికొన్ని ప్రదేశాల్లో స్థల పరిమితులు, సామగ్రి సరఫరా సమస్యలు, సమన్వయ సవాళ్ల కారణంగా జాప్యం సంభవించిందని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న గోపిశెట్టి రాఘవేందర్

చార్మినార్: ఆషాఢ బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు చేసిందని..తమ విజ్ఞప్తి మేరకు మరో రూ.10 కోట్ల బడ్జెట్‌ను కేటాయించేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తమకు హామీ ఇచ్చారని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. గురువారం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..బోనాల ఉత్సవాల్లో భాగంగా సప్తమాతృకల-సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొంటూ బంగారు బోనం షెడ్యూల్ వెల్లడించారు. ఈ నెల 26న గోల్కొండ జగదాంబ అమ్మవారికి మొదటి బంగారు బోనం సమర్పించనున్నామన్నారు. ఇంకా ఈ సమావేశంలో కామిశెట్టి(బుల్లెట్) శ్రీధర్, కళ్లం గురునాథ్ రెడ్డి, మానిక్ ప్రభు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

22న రవీంద్రభారతిలో చిత్రకళా ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: చిత్రలేఖనం అనేది ఒక అద్భుతమైన కళ అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో 'పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్'ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ది హైండ్ ది బ్రెష్'అనే చిత్రకళా ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిత్రకళ దాని వెనుక ఉన్న స్థితిగతులపై ప్రదర్శన ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. నిర్వాహకులు బైరు రమేష్ మాట్లాడుతూ..ఈ నెల 22 నుంచి రవీంద్రభారతిలో ఈ ప్రదర్శన జరుగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రకారులు శిరీష, పూజ, శివ, పద్మావతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో గాయత్రీ హోమం



గోల్కొండ: కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో గురువారం గాయత్రీ హోమం నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని ఈ హోమాన్ని నిర్వహించామని పూర్వ విద్యార్థి రవితేజ అన్నారు. శిశుమందిర్ హితైశి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పురోహితులు హరీష్‌శర్మ, ప్రదీప్‌కుమార్‌శర్మ యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు చాట్ల వజ్రలింగం, కార్యదర్శి శ్రీనివాస్ చక్రవర్తుల , కోశాధికారి రావుల శృజన తదితరులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూల రాజేశ్వరి పాల్గొన్నారు.

బోనాలను వైభవంగా నిర్వహిస్తాం



మధుసూదన్ గౌడ్

చార్మినార్: ఆషాఢ బోనాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ తెలిపారు. ఈసారి జరిగే బోనాల జాతర ఉత్సవాలను గతంలో కన్నా మరింత వైభవంగా నిర్వహించడానికి ఆలయానికి కొత్తగా కమిటీ ఏర్పడిందన్నారు. తనతో పాటు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కె.నరేందర్ ముదిరాజ్, కోశాధికారులుగా కిరణ్‌గౌడ్, ఆనంద్ ముదిరాజ్ తదితరులు నియమితులయ్యారని ఆయన తెలిపారు.

అన్నదానం



అబిడ్స్: చెన్నకేశవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. దాదాపు 200ల మందికి పౌష్టికాహారం అందించారు. కేవీ వసంత, అన్నపూర్ణ, సుజాత, భారతి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



లోతట్టు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అచ్చయ్యనగర్, దానయ్యనగర్, అచ్చయ్యనగర్, హనుమాన్‌నగర్, అంబికానగర్, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో వరదనీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలను సాగించలేకపోయారు. పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు పడరాని పాట్లు పడ్డారు.

గురుకుల విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు

విజయనగర్‌కాలనీ/నాంపల్లి: గురుకుల విద్యాసంస్థల్లో సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు 12 ఎస్సీ గురుకులాల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మనికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించడంతో పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. గురుకుల విద్యాసంస్థల ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేని యెడలా ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, కాసోజు నాగజ్యోతి, రాష్ట్ర నాయకులు చైతన్యయాదవ్, ఎస్.వంశీవర్ధన్‌రెడ్డి, బి.సంతోష్, ముదిగొండ మురళి, కృష్ణ, దత్తురెడ్డి, పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి జితేందర్ సింగ్ కృషి



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, విద్యావేత్త జితేందర్ సింగ్

అబిడ్స్: విద్యారంగ అభివృద్ధికి రిలయన్స్ హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ జితేందర్ సింగ్ అమోఘంగా కృషి చేస్తున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. 30 ఏళ్లకు పైగా ధూల్‌పేట్‌తో పాటు పాతబస్తీలో నిరుపేద ప్రజలకు నాణ్యమైన విద్యను అందిస్తున్న రిలయన్స్ హైటెక్ విద్యాసంస్థలు జూనియర్ కళాశాలను ప్రారంభించడంలో ఎంతో సంతోషంగా ఉందన్నారు. గురువారం తాళ్లగడ్డలో రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం జితేందర్ సింగ్ మాట్లాడతూ..సమాజ సేవకే తన తండ్రి మాజీ ఎమ్మెల్యే శివలాల్ తరహాలో జీవితాంతం ప్రజలకు విద్యను అందించడంతో పాటు సమాజ సేవలు చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు ముఖేష్ సింగ్, సింగ్‌లు, ట్రస్మా అధ్యక్షులు గాలయ్య, ప్రిన్సిపాల్ నిషా సింగ్, నరేష్ సింగ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీస్ పెట్రోలింగ్ పెంచాలి



టోలిచౌకీ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రోడ్లపై వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆపడం వల్ల వాహనాదారుల మధ్య గొడవలు ఏర్పాడుతున్నాయన్నారు. టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.20 లక్షలు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. విదేశీ విద్యార్థులు ఉండే కాలనీల్లో పగలు, రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలని దీన్ని వల్ల డ్రగ్స్ సరఫరా, డ్రగ్స్ వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ ఉన్నారు.

వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, జోనల్ కమిషనర్ వెంకన్న, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెకన్నను కోరారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయమైన యాకుత్‌పురాలోని మదీనానగర్, మౌలా కా చిల్లా, యశ్రఫ్‌నగర్ తదితర ప్రాంతాలను గురువారం ఆయన స్థానిక కార్పొరేటర్లు, జోనల్ కమిషనర్, పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలా పరిసర ప్రాంతాల్లో వరద నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయిందన్నారు. భారీ వర్షాలకు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు సూచించామన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..వర్షాకాలం నేపథ్యంలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో నాలా, డ్రైనేజీ మ్యాన్‌హోల్ పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. ఈ పర్యటనలో పత్తర్‌గట్టి, రెయిన్‌బజార్ డివిజన్ల కార్పొరేటర్లు సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మహ్మద్ వసీవుద్దీన్, ఈఈ ఏకాంబరం, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు అందరి సహకారం అవసరం



వృత్తిపని వారితో ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల ఏర్పాట్లను భారీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.వసంత అన్నారు. కోట బోనాల ఏర్పాటుపై గురువారం గోల్కొండ కోటలో ఆమె వృత్తిపని వారు బోనాల నిర్వహణ కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బోనాలు నిర్వహించేందు కు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు, సభ్యులు ఎన్.శ్రీకాంత్, అనిత, ఆనంద్‌గౌడ్, వృత్తిపని వారి సంఘం అధ్యక్షులు శివశంకర్, మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి



జీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాదరి చంద్రశేఖర్ తదితరులు

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్, ఉప్పుగూడ, రియాసత్‌నగర్ డివిజన్లలో నెలకొన్న తాగునీరు, మురుగునీటి ప్రవాహాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి జలమండలి జీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బస్తీల్లో తాగునీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో ప్రజలు నిత్యం అసౌకర్యానికి గురవుతూనే ఉన్నారన్నారు. ఇక ఏ గల్లీలో చూసినా మురుగునీరు రోడ్లపై పారుతుడడంతో ప్రజలు రోడ్లపై నడవలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాణిక్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో హైదరాబాద్ బాక్సర్ల సత్తా



పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించిన బాక్సర్లు

గోల్కొండ: ఈ నెల 10, 11న నిజామాబాద్‌లో జరిగిన 6వ జూనియర్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో హైదరాబాద్ షేక్‌పేట్‌కు చెందిన బాక్సర్లు సత్తాచాటారు. మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందిన వారిని గురువారం షేక్‌పేట్ బాక్సింగ్ క్లబ్ వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాక్సింగ్ కోచ్ ఎం.శశాంక్ మాట్లాడుతూ.. సిసుక్షిత బంగారు పతకం సాధించి జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిందన్నారు. ఈ నెల 18 నుంచి రోహతక్‌లో జరిగే జాతీయ జూనియర్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. అదే విధంగా భానుతేజ, సృజన్‌చారి, వసంత్ రజత పతకాలు, గౌతం కాంస్య పతకం సాధించారని ఆయన అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు శివకుమార్, పి.దినేష్‌బాబు తదితరులు ఉన్నారు.